www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 20 ఆగస్టు 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



సచివాలయంలో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 45/1 జేమ్స్ గార్డెన్, 46/2 కాపువీధి వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ శనివారం తనిఖీ చేశారు. సచివాలయాలలోని తనిఖీ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిష్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. సచివాలయాల పరిధిలోని ప్రజలకు స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అంది స్తున్న ఉచిత వైద్యం, మందుల పంపిణీ, రక్త పరీక్షలు తదితర సేవలపై అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. సచివాలయాలలో పెండింగులో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని కార్యదర్శులకు కమిషనర్ సూచించారు.

పంచాయతీ ఎన్నికల్లో

అధికార పార్టీకి ఆపసోపాలు..!

పంచాయతీ ఎన్నికల్లో అధికార వైసిపి మద్దతుదారులకు చెమటలు పట్టాయి. ఎన్నికలు జరిగిన చోట అధికారపార్టీ ఏకగ్రీవాలు చేసుకుంది. పోలింగ్‌కు దిగిన చోట టిడిపి, వైసిపి నువ్వా, నేనా అన్నట్లు పోలింగ్ జరిగింది. అత్యధిక స్థానాల్లో టిడిపి అభ్యర్థులు విజయం సాధించారు. మొత్తం 11 వార్డులు, ఒక్క సర్పంచ్ స్థానానికి పోలింగ్ జరగ్గా అందులో ఆరుచోట్ల టిడిపి, ఐదు చోట్ల వైసిపి అభ్యర్థులు విజయం సాధించారు. జలదంకి మండలంలోని లింగరాజు అగ్రహారం సర్పంచ్ స్థానాన్ని టిడిపి కైవసం చేసుకుంది. అధికారపార్టీ పోటీల్లో ఆపసోపాలు పడింది. సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హవా కొనసాగించారు. మనుబోలులో జరిగిన మూడు వార్డుల్లో వైసిపి విజయం సాధించింది.

- ◆11 వార్డులు, ఒక సర్పంచ్‌కు పోలింగ్
- ◆ఆరుచోట్ల టిడిపి, ఐదు చోట్ల వైసిపి వార్డులు కైవసం
- ◆ఒక సర్పంచ్ టిడిపి వశం
- ◆సర్వేపల్లిలో 'కాకాణి' హవా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

2019 నుండి ప్రతి ఎన్నికల్లోనూ తిరుగులేని ఆధిపత్యం సాధిస్తున్న వైసిపికి పంచాయతీ ఎన్నికల్లో చుక్కెదురైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 28 మండలాల్లో 60 గ్రామ పంచాయతీల్లో రెండు సర్పంచ్‌లు, 63 వార్డులకు ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. 14న నామినేషన్ ప్రక్రియ ముగిసింది. ఒక సర్పంచ్, 50 వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యాయి. రెండు వార్డులకు నామినేషన్ దాఖలు చేయలేదు. మొత్తం 11 వార్డులు, ఒక్క సర్పంచ్ స్థానానికి శనివారం పోలింగ్ నిర్వహించారు. 16 పోలింగ్ కేంద్రాల్లో 3612 ఓట్లకు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. సర్పంచ్ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు పోటీ పడ్డారు. వార్డు మెంబర్లకు 24 మంది అభ్యర్థులు రంగంలో దిగారు. ఏకగ్రీవాల్లో అధికారపార్టీ తమ ఆధిపత్యాన్ని కొనసాగించింది. 50 ఏకగ్రీవం చేసుకుంది. ఆత్మకూరు మండలం చెర్లో ఎడవల్లి పంచాయతీని వైసిపి కైవసం చేసుకుంది. పోలింగ్‌ను అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి పర్యవేక్షణలో ప్రశాంతంగా పోలింగ్, ఫలితాలు వెల్లడించారు.

అధికారపార్టీకి చెమటలు..!

పంచాయతీ ఎన్నికల్లో అధికారపార్టీకి చెమటలు పట్టాయి. ఏకగ్రీవాలు సాధించినా, ప్రజా స్వామ్య యుతంగా నిర్వహించిన పోలింగ్‌లో చతికిలపడింది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత మరో సారి రుజువైంది. శనివారం ఉదయం ఒక సర్పంచ్, 11 వార్డులకు పోలింగ్ నిర్వహించారు. ఇందులో సర్పంచ్ స్థానాన్ని టిడిపి గెలుచుకుంది. జలదంకి మండలం, లింగరాజు అగ్రహారం పంచాయతీ సర్పంచ్‌కు జరిగిన ఎన్నికల్లో టిడిపి బలపరిచిన మంగల తిరుమల 88 ఓట్లతో విజయం సాధించారు. సమీప వైసిపి అభ్యర్థి పి. వెంకమ్మకు 359 ఓట్లు వచ్చాయి. జలదంకి మండలం, వేములపాడు పంచాయతీలోని 7 వార్డుకు జరిగిన ఎన్నికల్లో టిడిపి బలపరిచిన పొట్లూరి ఆదిలక్ష్మమ్మ 34 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. వైసిపి తరపున కాకి పుల్లమ్మ పోటీ చేశారు. కొండాపురం మండలం, సాయిపేట పంచాయతీ 3 వార్డులో టిడిపి అభ్యర్థి విజయం సాధించారు. మొత్తం 340 ఓట్లు ఉండగా, అందులో 251 ఓట్లు పోల య్యాయి. అందులో టిడిపి బలపరిచిన రవీంద్రకు 144, టిడిపి రెబల్ అభ్యర్థికి 81 ఓట్లు వచ్చాయి. కోవూరు మండలం, పాటూరు పంచాయతీలో 2వ వార్డులో టిడిపి బలపరిచిన అభ్యర్థి రామిశెట్టి రాజేశ్వరి 26 ఓట్లతో గెలిచింది. వైసిపి అభ్యర్థి చిట్టిశెట్టి పద్మమ్మకు 107 ఓట్లువచ్చాయి. లింగసముద్రం మండలం చిన్నపావని గ్రామంలోని 2వ వార్డులో 231 ఓట్లకు గాను 194 ఓట్లు పోలయ్యాయి. అందులో 123 ఓట్లు టిడిపి అభ్యర్థి కోటేశ్వర మ్మకు రాగ, వైసిపికి 70 ఓట్లు వచ్చాయి. రాపూరు మండలం, గిలకపాడు పంచా యతీల్లో 3 వార్డులో వైసిపి అభ్యర్థి చల్లా రాజగోపాలరెడ్డి 42 ఓట్లతో గెలిచారు. టిడిపి తరుపున అంకమ్మ పోటీ చేసింది. రాపూరు మండలం, బొజ్జనపల్లి పంచాయతీలో 8 వార్డులో టిడిపి అభ్యర్థి నిమ్మల రమణమ్మ 23 ఓట్లతో గెలిచారు. ఉలవపాడు ఆత్మకూరు గ్రామంలో 5 వార్డులో టిడిపి అభ్యర్థి సి.కోటేశ్వరావు గెలిచారు. చేజర్ల మండలం, పడ్డిపాడు పంచాయతీలో వైసిపి అభ్యర్థి మస్తాన్‌బీ గెలిచారు. ఇక్కడ మొత్తం 64 ఓట్లు పోలు కాగా, 32 వైసిపి, 32 టిడిపికి వచ్చాయి. డ్రాను వేయడంతో వైసిపి అభ్యర్థి గెలిచారు. సర్వేపల్లి నియోజ కవర్గం మనుబోలులో మూడు స్థానాలు వైసిపి గెలు చుకుంది. మనుబోలు మండలం, మనుబోలు గ్రామంలోని 4 వార్డులో పరిమళ ఆదిలక్ష్మి గెలిచారు. బండేపల్లి 3 వార్డులో ఎ. రమణమ్మ, మడమనూరు 7 వార్డులో యు. దేవసేనమ్మ వైసిపి తరపున గెలిచారు. పార్టీ గుర్తులపై ఎన్నికలు జరగకపోయినా పార్టీలు బలపరిచిన అభ్యర్థులు రంగంలో నిలిచారు. పోలింగ్ జరిగిన చోట్ల టిడిపి మంచి విజయం సాధించింది. చేజర్ల మండలం లాటరీలో వైసిపి గెలిచింది.

కోవూరు మండలం, పాటూరులో అధికారుల నుంచి డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న

డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని జనార్దన్ రెడ్డి కాలనీ, అల్లీపురం ప్రాంతాల్లోని మురుగునీటి శుద్ధి కేంద్రాలతో నగర వ్యాప్తంగా డ్రెయినేజీ సమస్యలకు పరిష్కారం లభించనుందని కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. పబ్లిక్ హెల్త్, ఎల్,టి, నగర పాలక సంస్థ అధికారులతో కలిసి స్థానిక అల్లీపురం లోని ఎస్.టి.పి కేంద్రాన్ని కమిషనర్ శనివారం పరిశీలించారు. కమి షనర్ మాట్లాడుతూ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదేశాల మేరకు మురుగునీటి శుద్ధి కేంద్రాలను నడిపించేందుకు అవసరమైన అన్ని సాంకేతిక అంశాలను పరిశీలించి వర్కింగ్ కండిషన్ లోకి తీసుకొని రానున్నట్లు తెలిపారు. పబ్లిక్ హెల్త్ ఎస్.ఈ గోపాల్ రెడ్డి, ఎల్ ,టి అధికారులు పాల్గొన్నారు.

అన్నదానం మిన్న

ప్రజాశక్తి-నెల్లూరు : అన్నీ దానాల్లో కెల్లా అన్నదానం ఎంతో గొప్పదని, హరే కృష్ణ మూవ్మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ దేశ వ్యాప్తంగా ఎన్నో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జిజిహెచ్‌లో ఆ సంస్థ రోగుల సహాయకులకు సుభోజనం ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించింది. సుభోజనం ఫుడ్ స్టాల్ ను ఎంపి ప్రారంభించి మాట్లాడారు. హరే కృష్ణ మూవ్మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు విలాస్ విగ్రహ దాస్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. నరేంద్ర, విజయ డైరీ ఛైర్మన్ రంగారెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ప్రజాశక్తి-కందుకూరు : ఈ నెల 20న ఉదయం 8:30 గంటల నుంచి 01:30 వరకు సిటిఆర్ఐ, ఎంఆర్ఓ ఆఫీస్ ఫీడర్స్‌లో లైన్ కు తగిలే చెట్ల కొమ్మలు కొట్టేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఎఇ టివి నరసింహం తెలిపారు. ఆయా ఫీడర్స్ పరిధిలోని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మాదక ద్రవ్యాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రభుత్వ విభాగాలన్ని సమన్వయంతో ప్రత్యేక చర్యలతోనే జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలన సాధ్యమౌతుందని కలెక్టర్ ఎం. హరినారాయణన్ పేర్కొన్నారు. శనివారం ఎస్‌పి కార్యాలయంలో ఎన్‌సిఒఆర్‌డి సమన్వయ సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని, జూనియర్ కళాశాలలు, పాఠశా లల్లో అవగాహన సదస్సులు నిర్వహిం చాలన్నారు. డార్క్ స్పాట్స్ ను గుర్తింపు, శివారు ప్రాంతాలు ఆయా ప్రదేశాలలో లైటింగ్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పోలీస్ బీట్ వ్యవస్థ బాగుందని అభినందించి, డార్క్ స్పాట్స్, హాస్టల్స్ ను సందర్శించాలని సూచనలు చేశారు. సముద్ర మార్గాల ద్వారా గంజాయి అక్రమరవాణా అరికట్టుటకు ఆయా విభాగాలు ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి లగేజ్, పార్సిల్ లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్‌పి మాట్లాడుతూ నెల్లూరు, కావలి మున్సిపల్ పరిధిలో 34 డార్క్ స్పాట్స్ గుర్తించినట్లు, తగిన ఏర్పాట్లు పూర్తి చేసి ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఎన్‌సిఒఆర్‌డి ప్రత్యేక వాట్స్ యాప్ గ్రూప్ ద్వారా మరింత సమన్వయంతో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు సత్వర చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అడిషనల్ ఎస్‌పి.(అడ్మిన్) గంజాయి విక్రయ, అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసి కేసుల నమోదు, నిందితులు అరెస్ట్, స్వాధీనం చేసుకున్న వివరాలు తదితర అంశాలు వివరించారు. డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఎం.పెంచలయ్య, జిల్లా ఎస్‌సి వెల్ఫేర్, జిల్లా విద్యాశాఖ అధికారిణి, టెర్రీటోరియల్ ఫారెస్ట్ ఆఫీసర్, సబ్ కలెక్టర్ కందుకూరు, జెడి అగ్రికల్చర్, జాయింట్ కమీషనర్ కమర్షియల్ ట్యాక్స్, ఇండియన్ కోస్ట్ గార్డ్ కమాండెంట్, ఆర్‌డిఓ, క్రిష్ణపట్నం పోర్ట్ సిఈఓ, ఇంటలిజెన్స్ అధికారులు, జిల్లా ఎస్‌ఈబి అధికారులు ఉన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

ఆడ ఎనాఫిలిస్ దోమ వల్ల మనిషికి మలేరియా వ్యాధి వస్తుందన్న విషయాన్ని సర్‌రోనాల్డ్ రాస్సి అనే శాస్త్రవేత్త 1879 ఆగష్టు 20వ తేదీనకనుగొన్నారని, ఆ రోజును గుర్తు చేసుకుంటూ ప్రతి ఏడాది ఆగష్టు 20వ తేదిన ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించు కోవడం ఆనవా యితీగా వస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య అన్నారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మలేరియా కేసులు నమోదు కావడంలేదన్నారు. డెంగ్యూ కేసులు అధికంగా నమోదు అవుతున్నాయన్నారు. ఈ ఏడాది కేవలం 4 మలేరియా కేసులే నమోదు అయ్యాయన్నారు. గత ఏడాది డెంగ్యూ కేసులు 115 నమోదు కాగా ఈ ఏడాది మాత్రం 96 కేసులు నమోదైయ్యాయన్నారు. దోమలు చిన్నవై అయినప్పటికీ వాటి వల్ల చాలా ప్రమాదం కలిగించేవిగా భావించి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా మలేరియా నివారణాధికారిణి ఈ హుస్సేనమ్మ ఆధ్వర్యంలో శాస్త్రవేత్త సర్‌రోనాల్డ్ రాస్సి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి-గుడ్లూరు : సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాల్లో ప్రజలకి అవగాహన కల్పించాలని డి ఎంహెచ్ ఓ పెంచలయ్య తెలిపారు. స్థానిక వైద్య ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మారుతీ రావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. నీటిని వడపోసి చేవించాలని, పరి సరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఐఎఫ్‌సి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-కందుకూరు : ఆకలికి అందరూ బంధువులే" అనే నినాదంతో ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ కందుకూరు వారి ఆధ్వర్యంలో శనివారం పేదల కోసం కందుకూరులో వృద్ధులు, వికలాం గులను గుర్తించి వారికి భోజనాల ప్యాకెట్లు అందించారు. ప్రతి ఒక్కరు తమ సామా జిక బాధ్యతగా పేదలకు సాయం అందిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగు తుందని ఫౌండేషన్ సెక్రెటరీ షంషేర్ తెలిపారు. ప్రెసిడెంట్ సాజిద్,ట్రెజరర్ హఫీజ్,ఇంచార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని మోపాడు గ్రామంలో శివాలయం పంతులు గృహ నిర్మాణం కోసం రూ 50 వేలను కందుకూరు నియోజకవర్గం యువ నాయకుడు, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ శనివారం అందజ ేశారు. నగదును గృహ నిర్మాణానికి సద్విని యోగం చేసుకోవాలని సూచించారు.

'నా భూమి - నా దేశం'

నెల్లూరు : ఆజాదీ కా అమత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ నిర్దేశాల మేరకు నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన "నా భూమి– నా దేశం", " నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం" కార్యక్రమాలను శనివారం వేడుకగా నిర్వహించారు. రూరల్ నియోజకవర్గంలోని 23 వ డివిజన్ పడారుపల్లి మారుతీ పార్కులో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కమిషనర్ వికాస్ మర్మత్ లు హాజరయ్యారు. పడారుపల్లి పార్కులో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నా భూమి–నా దేశం భాగంగా నేల తల్లికి నమస్కారం– వీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర పాలక సంస్థ వివిధ స్థానిక డివిజను కార్పొరేటర్, వివిధ డివిజన్ కార్పొరేటర్లు,కో ఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

'ప్రకాశం' విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు

మల్టీ నేషనల్ కంపెనీలకు తగిన నైపుణ్యాలతో ఇంజినీర్లను తయారుచేసే సమర్థవంతమైన పరిశ్రమగా, ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీని తమ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ విజయ శ్రీనివాస్ తీర్చిదిద్దారని కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల రామయ్య చెప్పారు. సి.ఆర్.టి ఎగ్జామ్స్‌లో ప్రతిభ కనబరిచిన ఫైనల్ ఇయర్ బీటెక్ విద్యార్థులను శనివారం అభినందించారు. అనంతరం క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ అందించిన మ్యాక్స్ సంస్థ సీ.ఈ.ఓ కోటిరెడ్డి విద్యార్థులు పట్టుదలతో టెన్త్ క్లాస్ ఫెయిల్ అయినప్పటికీ క్రికెట్ చరిత్రలో ఉన్నత స్థానాన్ని అధిరోహించిన సచిన్ టెండూల్కర్ లాంటి దిగ్గజాలను స్ఫూర్తిగా తీసుకొని కషి చేస్తే సామాన్య విద్యార్థి కూడా మల్టీ నేషనల్ కంపెనీస్ నందు ఉద్యోగాన్ని సాధించొచ్చన్నారు. విద్యార్థులు శ్రమించేలా చేసి డిగ్రీ తో పాటు ఉద్యోగ ఆఫర్ లెటర్ అందించడమే తమ కాలేజీ లక్ష్యమని డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ ఆకాంక్షించారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించడానికి ఇటువంటి కార్యక్రమాలు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు క్యాష్ అవార్డులను రామయ్య, విజయ్ శ్రీనివాస్, కోటి రెడ్డి అందించారు అకడమిక్ ఇంచార్జ్ ఎస్.ఎన్ మీరావాలి, టి.పి.వో బాలకష్ణ తో పాటు డిపార్ట్మెంట్ ప్లేస్మెంట్ కోఆర్డినేటర్స్ ఎన్.ఎం మాధవరావు, గద్దే సురేష్, కొల్లా కోటయ్య, శ్రీనివాసరెడ్డి , మీరా షరీఫ్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న కంచర్ల రామయ్య

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-ముత్తుకూరు

సాగర మాల భారత్ మాల జాతీయ రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని వ్య.కాస. జిల్లా ఉపాధ్యక్షులు నక్కా రాధయ్య కోరారు. శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. సోమవారం 21వతేదీ ఉదయం 10గంటలకు కలెక్టరేట్ దగ్గర జరిగే రాయబారం కార్యక్రమానికి మండలంలోని రైతులందరూ తరలిరావాలని కోరారు నాయకులు గడ్డం అంకయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సాగరమాల హైవే రోడ్డు విస్తరణకు భూములను కోల్పోతున్న రైతులకు ఎకరాకి 80 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 21వ తేదీన కలెక్టర్ రేట్ కార్యాలయంలో జరిగే సామూహిక రాయబార కార్యక్రమానికి రైతులందరూ తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పెద్దపూడి వెంకయ్య, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

నెల్లూరు: జిల్లాలోని 9మండలాల్లో భూసేకరణ చేస్తుంది. సేకరణ సందర్భంగా అధికారులు 2013 భూసేకరణ చట్టం అమలు చేయడంలేదు. గ్రామసభలు నిర్వహించకుండా, తగిన నోటీసులు ఇవ్వకుండా స్థానిక తహశీల్దార్లు, ఆర్‌డిఒలు రైతులకు తెలియకుండానే డబ్బులు వేస్తున్నారు. రైతులకు తగిన పరిహారం ఇవ్వడంలో జిల్లా అధికారులు శీత కన్నువేశారు. ఈవిషయం జిల్లా దృష్టికితీసుకొని వెళ్లేందుకు 21వతేదీ సోమవారం నష్టపోతున్న రైతులందరూ నెల్లూరుకు తరలిరావాలని రైతు సంఘాల నాయకులు కోరారు. జొన్నలగడ్డ వెంకమరాజు, మంగలపుల్లయ్య, పి.శ్రీరాములు, మూలివెంగయ్య, ముత్యాల గురునాథం పాల్గొన్నారు.

వైసిపి పతనం ఖాయం : టిడిపి

ప్రజాశక్తి-కందుకూరు : రాష్ట్రంలో జరిగిన పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచ్ ఎన్నికల్లో టిడిపి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవటమే టిడిపి బలానికి నిదర్శమని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరు నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు ఎన్నికల ఫలితాలు నిదర్శనమన్నారు. కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు మండలం ఆత్మకూరు, లింగసముద్రం మండలం చిన్నపవని పంచాయతీ వార్డు సభ్యులకు జరిగిన ఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారన్నారు. చిన్నపవని గ్రామంలో వార్డు కు జరుగుతున్న ఎన్నికల్లో ఓటు వేయనందుకు ఓ రైతును వేధింపులకు గురి చేసారని చెప్పాడు. సొసైటీలో రైతుకు ఉన్న అప్పుని సాకుగా తీసుకొని అతని పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగే విధంగా ప్రచారం చేయడంతో పాటు ఉన్న బాకీ లో కొంత కడతానని బ్యాంకుకు వెళ్లి అడగగా అట్రాసిటీ కింద రైతుపై కేసు నమోదు చేయడం దారుణమన్నారు. కందుకూరు మండలం కొండడుసుపాలం సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయడానికి శాసనసభ్యులు రెకమండేషన్ చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చున్నారు. సర్పంచ్ దళిత మహిళ అనే విషయాన్ని కూడా లెక్కలోకి తీసుకోకుండా చెక్ పవర్ రద్దుకు సిఫారసు చేసిన పరిస్థితిని నాగేశ్వరరావు వివరించారు. కందుకూరు నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని మాజీ శాసన సభ్యులు డాక్టర్ దివి శివరాం చెప్పారు. టిడిపి నాయకులు దామా మల్లేశ్వరరావు, ఎన్ వి సుబ్బారావు, బెజవాడ ప్రసాద్, చిలకపాటి మధు, షేక్ రఫీ ఉన్నారు.

మాట్లాడుత్ను ఇంటూరి,దివి శివరాం

జగనన్న కాలనీ నిర్మాణ పనులు వేగవంతం

నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని జగనన్న కాలనీ లే అవుట్లలో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన మేరకు అదనపు కార్మికులను నియమించుకుని, నిర్మాణ పనులను పూర్తి స్థాయిలో వేగవంతం చేయాలని హౌసింగ్ విభాగం అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. జగనన్న కాలనీల నిర్మాణ పనుల పురోగతిపై హౌసింగ్ విభాగం, నగర పాలక సంస్థ అధికారులతో స్థానిక వెంకటేశ్వరపురంలోని లే అవుట్ ను కమిషనర్ శనివారం పరిశీలించారు. హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, మెప్మ సిబ్బంది, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కాలనీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

కల్తీ బియ్యంతో మోసం

ప్రజాశక్తి- గుడ్లూరు

నెల్లూరు సన్నాలు బియ్యం, జీలకర్ర మసూర బియ్యం పేరుతో కొందరు మోసగాళ్లు మండలంలోని అనేక గ్రామీణ ప్రాంతాలకు చేరుకుని మహిళలకి మాయమాటలు చెప్పి రీ పాలిష్ వేసిన రేషన్ బియ్యాన్ని ఎక్కువ ధరకి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ముగ్గురు వ్యక్తులు ఉన్న ఈ ముఠా సభ్యులు ముందుగా నిజమైన నెల్లూరు సన్నాలు ఒరిజినల్ బియ్యాన్ని ఒక్కొక్క మహిళకి కిలో లెక్కన అందజేసి, అన్నం తయారు చేసి సాంపిల్ చూడమని చెబుతారు. అన్నం మల్లె పువ్వు లాగా బాగా ఉండటంతో బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు మహిళలు ముందుకు వస్తారు. మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకు ఇవ్వడంతో కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన బియ్యం అన్నం వండడంతో అసలు మోసం బయటపడుతుంది. ఈ లోగా మోసగాళ్లు అక్కడి నుంచి పారిపోతారు. 25 కేజీల టిక్కీలు ప్యాకింగ్ చేసుకొని ఆటో నిండా వేసుకొని మండలంలోని చేమిడిదిపాడు, అమ్మవారిపాలెం, అడవిరాజుపాలెం గ్రామీణ ప్రాంతాలకి చేరుకున్న బియ్యం మోసగాళు ఒక పథకం ప్రకారం అమ్మకాలు సాగించి కనిపించకుండా వెళ్ళిపోతున్నారు. కిలో రూ. 10కి కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని రూ. 20 నుంచి 25 రూపాయలకే గ్రామీణ మహిళలకు అంటగట్టి జేబులు నింపుకుంటున్నారు. గత ఆరు నెలలుగా గుడ్లూరు మండలంలో సాగుతున్న ఈ నకిలీ బియ్యం కొనుగోలు చేసే మోసపోయిన మహి ళలు విలేకర్ల ఎదుట వాపోయారు. నకిలీ బియ్యం అమ్ముతున్న ముఠా సభ్యుల్ని అదుపులోకి తీసుకొని విచారణ చేయాలని బాధిత మహిళలు పోలీసులను కోరారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి -రాపూరు : మండలంలోని సంక్రాతిపల్లిలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వెంకటగిరి సమన్వకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. అర్హత ఉండి పథకాలు అందని లబ్ధిదారులకు వెంటనే ఆ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అది.కారులను ఆదేశించారు. పంచాయతీ అధికారులు, జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, జెఎస్సి ఎస్ కన్వీనర్ దందోల్ నారాయణరెడ్డి, చెన్ను తిరుపాలురెడ్డి ఉన్నారు.



కార్యమ్రకంలో పాల్గొన్న నేదురుమల్లి

చినపవని రెండో వార్డులో టిడిపి విజయం

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని చినపవని పంచాయితీలో శనివారం జరిగిన ఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థి పారా కోటేశ్వరమ్మ విజయం సాధించారు. పంచాయ తిలోని రెండో వార్డుకు ఎన్నికలు జరగగా వైసిపి, టిడిపి బలపరిచిన అభ్యర్థులను బరిలోకి దిగారు. 231 ఓట్లుగాను 194 ఓట్లు పోలయ్యాయి. టిడిపి బలపరిచిన అభ్యర్థికి 123 ఓట్లు, వైసిపి బలపరిచిన అభ్యర్థికి 70 ఓట్లు వచ్చాయి. టిడిపి బలపరిచిన అభ్యర్థి 53 ఓట్లు మేజార్టీతో విజయం సాధించారు. గెలుపొందిన కోటేశ్వరమ్మను మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాలరావు, ప్రధాన కార్యదర్శి పూరిమిట్ల మాల్యాద్రి, పెదపవని మాజీ సర్పంచ్ నాయబ్ రసూల్,టిడిపి నాయకులు మనోహర్, పిచ్చయ్య, పోకూరి రవీంద్ర, మాదవరపు మహే శ్వరరావు, ఉమ్మనేని నరసిం హరావు, తూమాటి వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

కోటేశ్వరమ్మను అభినందిస్తున్న గోపాలరావు,టిడిపి నాయకులు

రాపూరు : మండలంలోని భోజన పల్లి పంచాయతీలో జరిగిన వార్డు మెంబర్ ఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థి నిమ్మల రవణమ్మ సమీప వైసిపి అభ్యర్థి పొట్లూరు బుజ్జమ్మ పైన 23 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మండల నాయకులు భోజన పల్లి పంచాయతీ టిడిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

ఉలవపాడు : ఉలవపాడు మండలం ఆత్మకూరులో శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో రెండు ఓట్లు తేడాతో వైసిపి బలపరిచిన శ్యామల మీద టిడిపి మద్దతుదారుడైన చిరు తోటి కోటేశ్వరావు విజయం సాధించాడు. మొత్తం 127 ఓట్లకు గానూ మెండ శ్యామల కు 62 ఓట్లు పోలుకాగా చిరు తోటి కోటేశ్వరరావుకు 64 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఆత్మకూరు ఉప ఎన్నికల్లో టిడిపి మద్దతు దారుడైన చిరు తోటి కోటేశ్వరరావు విజయం సాధించాడు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం మాదక ద్రవ్యాల నివారణలో భాగంగా కందుకూరు పట్టణంలోని ప్రతిభ జూనియర్ కాలేజీలో మాధకద్రవ్యలకు వ్యతిరేకం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులతో పాటు కళాశాల డీన్ వి మనోజ్ కుమార్, ప్రిన్సిపాల్ వెంకారెడ్డి, సిఇఒ జయ ప్రకాష్ నారాయణ, అధ్యాపకులు పాల్గొని తమ సందేశాలు ఇచ్చారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు, సిబ్బంది ఎస్. కె. సలీం బాషా, డి. ఎం. సి. రంగన్న పాల్గొన్నారు.

సత్‌ప్రవర్తన కలిగి ఉండాలి

పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో కందుకూరు డిఎస్‌పి రామచంద్ర, ఎస్ఐ శ్రీరామ్ నగర్ కాలనీ వాసులతో అవగాహన కల్పించారు. కందుకూరు డిఎస్‌పి రామచంద్ర కాలనీ వాసులనుద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలని సూచించారు. బెల్ట్‌షాప్‌ల నిర్మూలన గురించి, పేకాట కోడిపందాల నియంత్రణ గురించి, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై అవగాహన కల్పించారు.

సహకార వ్యవస్థ మరింత బలోపేతం

ప్రజాశక్తి-కోవూరు : సాకార వ్యవస్థ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సహకార సంస్థ అధికారి డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం సహకార సంఘాల పాలన నిర్వహణపై ఖాతాదారులు రైతులకు అవకాశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ప్రయోజనాలే లక్ష్యంగా పెట్టుకుని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నూరేళ్లపైగా చరిత్ర కలిగిన సహకార వ్యవస్థ పునాదులు బలంగా ఉండాలన్నారు. సహకార వ్యవస్థ మరింత బలోపేతం కావాలంటే దానికి సంబంధించిన మూలాలు బలంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. డీసీపీఓ తిరుపాలు రెడ్డిమాట్లాడుతూ జిల్లాలోని అన్ని సహకార సొసైటీలలో మీసేవ సేవలు కూడా అందించేలా తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో చైర్మన్ ఆర్ మల్లికార్జున రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్ నరసింహులు రెడ్డి, సొసైటీ సీఈఓ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

పేదల భూములకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రభుత్వం మైనార్టీలకు ఇచ్చిన భూములను అన్యాక్రాంతం కాకుండా రక్షణ కల్పించాలని తహశీల్దార్ జగదీష్‌బాబుకు రైతు సంఘ నాయకులు కాకు వెంకయ్య వినతిపత్రం అందజేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌ను ఆయన కలిసి మాట్లాడుతూ బండగానిపల్లి పంచాయతీలోని పేదప్రజలకు గతంలో ఇచ్చిన ప్రభుత్వ పట్టా భూములను కల్పించాలని తెలిపారు. తమ భూములను రక్షణ కల్పించి భూములను ఇప్పించాలని వారు కోరారు. సోమవారం భూమి గల ప్రతి ఒక్కరూ తమ కార్యాలయం ఎదుట భూములకు రక్షణ కల్పించాలని ఆందోళన చేపడుతున్నామన్నారు. భూమి కోల్పోయిన రైతులు ఈ ఆందోళనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజ్జంపల్లి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శంభుని కాపులకు ఎస్‌సి సర్టిఫికెట్లు దారుణం

ప్రజాశక్తి-కావలి : శంభుని కాపులకు ఎస్‌సి హోదాతో ఎస్‌సి సర్టిఫికెట్లు ఇవ్వడం చట్ట విరుద్ధమని, ఎంఎల్‌ఎ ద్వారా అధికారులపై ఒత్తిడి చేయడం తగదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు మల్లి పేర్కొన్నారు. శనివారం కావలి పట్టణంలోని రైల్వే రోడ్డులో ఉన్న "జర్నలిస్ట్ క్లబ్"లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.మల్లి మాట్లాడుతూ 21వ తేదీ కావలి పట్టణంలోని ఆర్.డి.ఓ. కార్యాలయం ఎదుట జరిగే మహాధర్నాలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని తీరప్రాంత గ్రామాల్లో అక్కడక్కడ శంభుని కాపులు ఉండే వారని తెలియజేశారు. మద్రాస్ నుండి తీరప్రాంతాలకు వచ్చి ఉన్నారని తెలియజేశారు. కావలి నియోజకవర్గంలో మూడు గ్రామాల్లో ఉన్నారని వారికి గతంలో జిఒ నెంబర్ 25 తీసుకుని వచ్చి ఎస్‌సి సర్టిఫికెట్లు తీసుకున్నట్లు తెలియజేశారు. తర్వాత ఉద్యోగాలు కూడా పొందారని, దానిపై హైకోర్టు సమగ్ర విచారణ జరిపించి ఆ జిఒను కొట్టి పారేసిందని ఆ నియమకాలు కూడా రద్దు చేశారని తెలియజేశారు. శంభుని కులస్తులు తీర ప్రాంత గ్రామాలలో మంచి ఆర్థిక బలం ఉన్న వారికి సర్టిఫికెట్లు ఇస్తామనడం కులం చిచ్చు పెట్టడం సరికాదని తెలిపారు. రాజకీయనాయకులు ఎన్నికల ముందు ఇలాంటి జిమ్మిక్కులు చేయడం సహజమని తెలియజేశారు. కాపులకు ఎస్‌సి సర్టిఫికెట్లు ఇవ్వకుండా రాజ్యాంగపరంగా చట్టపరంగా వ్యవహరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జి.అశోక్, ఎం.మోహన్‌రావు జరుగుమల్లి విజయరత్నం, నారుబోయిన లక్ష్మయ్య, చౌటూరి వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

వలంటీరుల కుటుంబాలకు జగనన్న అండ

ప్రజాశక్తి-మర్రిపాడు : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ స్వచ్ఛందంగా విధులు నిర్వహిస్తున్న వలంటీర్ల కుటుంబాలకు వైసిపి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఎఎస్‌పేట మండలం అనుమసముద్రం గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కప్పల బాబు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.5లక్షల చెక్కును శనివారం ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి స్వగ్రామం బ్రాహ్మణపల్లిలోని నివాసంలో అందచేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నియోజకవర్గం ఎఎస్‌పేట మండలానికి చెందిన ఇద్దరు వలంటీర్లకు ఇప్పటికే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.5 లక్షల వంతున ఒక్కో కుటుంబానికి సహాయం చేసినట్లు, ఇప్పుడు అదే మండలానికి చెందిన వలంటీర్ కప్పల బాబు రెండు సంవత్సరాల క్రితం మృతి చెంది వారి కుటుంబం ఆర్థిక పరిస్థితి సరిగా లేదని మండల నాయకులు తమ దృష్టికి తీసుకురావడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆర్థికసాయం మంజూరు చేయించామన్నారు. ప్రజల మన్ననలు పొందుతున్న వలంటీర్ల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు.

నూతన దంపతులకు మాలేపాటి ఆశీర్వాదం

ప్రజాశక్తి-బిట్రగుంట : మండలంలోని బోగోలు పంచాయతీలో ఉన్న ఆర్‌సిఎం చర్చిలో జరుగుతున్న బుర్రి రామకృష్ణ కుమార్తె సౌమ్య - సాయికృష్ణల వివాహ వేడుకకు శనివారం కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కప్పరాలతిప్ప గ్రామంలోని పందిపాటి శేఖర్ ఇటీవల అనారోగ్యంతో నెల్లూరు విజయ హాస్పిటల్ చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను, అనారోగ్యంతో బాధపడు తున్న మేకల అమ్ములయ్యను వారివారి నివాసం వద్దకెళ్లి పరామర్శించారు. ఆయనతో బోగోలు మండల టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్ బాబు, టిడిపి వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి లక్కాకుల మాధవరావు, మస్తాన్ నాయుడు, గరిపినేని నాగరాజు, బుర్రి వెంకట్రావు, అరుణమ్మ, తదితరులున్నారు.

విద్యార్థుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థి భౌతికంగా చదివే పాఠశాల హాజరు పట్టి ఆన్‌లైన్‌లో పేరు నమోదై ఉండాలని ఎంపిడిఒ మల్లికార్జున పేర్కొన్నారు. శనివారం పలుప్రైవేట్ పాఠశాలలను ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించి యాజమాన్యాలకు సూచనలు సలహాలు అందజేశారు. హెచ్‌ఎంలు చైల్డ్‌ఇన్‌ఫోలో నమోదు చేసే హాజరుపట్టీలో హాజరు వేయాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. వెల్ఫేర్‌అసిస్టెంట్ నారాయణ, తదితరులున్నారు.

ఇసుక లారీలు అడ్డగింత

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని పడమటి కంభంపాడు ఇసుక రీచ్ నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలను శనివారం జనసేన ఆధ్వర్యంలో గ్రామస్తులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు నలిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ అనుమతులు ముగిసినప్పటికీ ఇసుక రీచ్ నుండి యథేచ్ఛగా ఇసుక అక్రమరవాణా జరుగుతుందని తెలిపారు. డంపింగ్ యార్డు పేరుతో దొంగ పేర్లతో అనంతసాగరం, సంగం, ఆత్మకూరు ఇసుక రీచ్‌ల నుంచి జోరుగా రవాణా సాగుతుందన్నారు. అధికారులు ఇసుక అక్రమ రవాణాను ఆపాలంటూ జనసేన నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేననాయకులు ఉదయగిరి శ్రీనివాసులు, తదితరులున్నారు.

వివాహ వేడుకల్లో చెంచలబాబు

ప్రజాశక్తి-ఉదయగిరి : పలు వివాహాల్లో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. శనివారం నియోజకవర్గంలోని ఉదయగిరి, సీతారామపురం, వింజమూరు మండలాల్లో జరుగుతున్న వివిధ వివాహాలకు ఆయన హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీఎంఎల్‌ఎ కంభం విజయరామిరెడ్డి, మండల కన్వీనర్ చింతలబోయిన బయన్న, నాయకులు పాల్గొన్నారు.

'మేరీ భూమి - మేరా దేశ్'

ప్రజాశక్తి-ఆత్మకూరు : బ్రిటీష్ దొరల కబంధహస్తాల నుంచి భరతమాతకు విముక్తి లభించి 75 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'మేరీ భూమి - మేరా దేశ్' కార్యక్రమం జరుపుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని కమిషనర్ బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. తొలత మున్సిపల్ కార్యాలయంలో అమరవీరులకు నివాళులర్పిస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశం కోసం ఎందరో అమరవీరులు ప్రాణాలర్పించారని వారి త్యాగఫలమే ఇవాళ మనం అనుభవిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పొదమేకల పెంచలయ్య, మహబూబ్ బాషా, సూరా భాస్కర్ రెడ్డి, ఎం.రాజశేఖర్, వైసిపి నాయకులు రహీం, మున్సిపల్ ఆర్‌ఐ ఖాసీం, ఈ ప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న లారీ

ప్రజాశక్తి-కావలి రూరల్ : బైకును లారీ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం ముసునూరు టోల్‌గేట్ వద్ద చోటుచేసుకుంది. వివరాల మేరకు... కొండబిట్రగుంట శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లి శనివారం తిరిగి కావలి వస్తుండగా ముసునూరు టోల్‌గేట్ వద్ద నెల్లూరు వైపు నుండి వస్తున్న బైకును లారీ ఢీకొట్టింది. కావలి పట్టణంలోని కంగోలమ్మపేటకు చెందిన కోట శ్రీనివాసరావు ఉదయం తన స్కూటీపై కొండ బిట్రగుంటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లి తిరిగి కావలికి వస్తుండగా మార్గం మధ్యలో టోల్‌ప్లాజా వద్దకు చేరుకునేసరికి శ్రీనివాసరావు మోటార్ సైకిల్‌ను వెనుక నుండి నెల్లూరు వైపు నుండి అతివేగంగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో శ్రీనివాసరావుకు బలమైన రక్త గాయాలవడంతో అక్కడికక్కడే చనిపోయినట్లు, మృతుడి మేనల్లుడు పబ్బిశెట్టి వెంకటసురేష్‌కుమార్ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. ఫిర్యాదు మేరకు కావలి రూరల్ ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలు పట్టని పాలకులకు బుద్ధిచెబుదాం..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ప్రజా సమస్యలను విస్మరించి పాలిస్తున్న పాలకులకు ప్రజలు బుద్ధి చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు పిలుపు నిచ్చారు. శనివారం మైపాడు నుంచి కొత్తూరు వరకు ప్రజాపోరుయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల పాదయాత్రల సందర్భంగా కోవూరు నియోజవర్గ సమగ్ర అభివృద్ధికి పలు హామీలు ఇవ్వడం జరిగినదని, వాటిలో ఏ ఒక్కటీ నేటికీ నెరవేరలేదని విమర్శించారు. కోవూరు కోపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ పునర్ వైభవం తీసుకొచ్చి ప్రారంభిస్తామని చెప్పి నేటికీ నాలుగున్నర సంవత్సరం పూర్తవుతున్న ఆ హామీని అమలు చేయకపోగా కోవూరు షుగర్ ఫ్యాక్టరీ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకి అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. దానిని సిపిఎం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ముదువర్తి - ముదివర్తిపాలెం మధ్య కాజ్‌వే నిర్మాణం ఎన్నికల హామీలకే పరిమితం అవుతుందన్నారు. పాలకులు గద్దెనెక్కిన తర్వాత ఈ హామీని పూర్తిగా విస్మరిస్తున్నా రని ఎద్దేవా చేశారు. విడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లోని సుమారు 50 పైగా గ్రామాలు నేటికీ ఉప్పునీటిమయం అవుతున్నా పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. మైపాడు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి అనేక అవకాశాలు ఉన్న అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మైపాడు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతే ప్రజలకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు నెల రోజులు దాటుతున్నా డబ్బులు ఇవ్వడం లేదని ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేయడంలో కుట్రలో ఇది ఒక భాగమని తెలిపారు. 21న కోవూరు నియోజకవర్గ ప్రజా సమస్యలపై కోవూరు మండల కేంద్రంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రజల పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య, దయాకర్, టివివి ప్రసాద్, జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా, సిపిఎం మండల కార్యదర్శి కోటేశ్వర రావు, ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు చాన్‌బాషా, కార్యదర్శులు దయాసాగర్, వాసు, గంగపట్నం ఆటో యూనియన్ కార్యదర్శి బత్రి ప్రసాద్, డివైఎఫ్ఐ నాయకులు చీమకుర్తి శ్రీనివాసరెడ్డి, ఇందుకూరుపేట లీగల్ అడ్వైజర్ శ్యామ్‌రెడ్డి, నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ అధ్యక్షులు పరశురామయ్య, లక్ష్మయ్య, గంగపట్నం, మైపాడు, ఇందుకూరుపేట ఆటో యూనియన్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

మాట్లాడుతున్న ఎం.మోహన్‌రావు

సంక్షేమ ఫలాలతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-కావలి : అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందినప్పుడే వారి జీవితాలు బాగుపడతాయని కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక నవవికాస్ వద్ద ఉన్న విఘ్నేశ్వర ఆలయం నుండి శనివారం "గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం" చేపట్టారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎంఎల్‌ఎకు 22వ వార్డు మాజీ కౌన్సిలర్ గంధం ప్రసన్నాంజనేయులు స్వాగతం పలికారు. ప్రతి గడపలో మంగళ హారతులు, ఆప్యాయ పలకరింపులు, మంగళ వాయిద్యాల మధ్య మహిళలు ప్రతి గడపకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గ్రామాల్లోని ప్రజలకు, పూర్తిస్థాయి సేవలు అందిస్తున్నామ న్నారు. సచివాలయ వలంటీర్ వ్యవస్థల ద్వారా పేదల ఇళ్ల ముంగిటకే పథకాలు అందిస్తూ, గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని నెలకొల్పా రన్నారు. విద్య, వైద్యం, అభివృద్ధి చెందినప్పుడే ప్రతిఒక్కరూ అభివృద్ధి చెందుతారన్నారు. అనంతరం ఇందిరానగర్‌లోని మున్సిపల్ పాఠశాలలో చిన్నారులతో ఆయన ముచ్చటిం చారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు వెళ్లాలని వారిని ఆశీర్వదించారు. విద్యార్థులకు అందుతున్న "అమ్మఒడి" పథకంపై ఆయన ఆరాదీశారు. అలాగే విద్యార్థులకు అందుతున్న పుస్తకాలు, యూని ఫారం, బోర్డు అలాగే విద్యను గురించి కూడా ఆయన విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలకు మధ్యాహ్న భోజనం పిల్లలకు వడ్డించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, 23వ వార్డు మాజీ కౌన్సిలర్ కనుపర్తి రాజశేఖర్, 1వ వార్డు కౌన్సిలర్ పులి చక్రపాణి, పులి రజిని, మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ల శ్రీనివాస్ కిరణ్, 29వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పెనుమల్లి అశోక్, 18వ వార్డు ఇన్‌ఛార్జి అబ్దుల్‌రహీం, షేక్.ఆబిద్, కమిషనర్ కిరణ్, మున్సిపాలిటీ కుందుర్తి కామయ్య, కృష్ణారెడ్డి, 16వ వార్డు పేరం వేంకటేశ్వర్లు, వైసిపి నాయకులు, సచివాలయ ఉద్యోగులు, మెప్మా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మేనిఫెస్టోను అందజేస్తున్న ఎంఎల్‌ఎ రామిరెడ్డి

ప్రభుత్వానికి వలంటీరులే పట్టుగొమ్మలు..

ప్రజాశక్తి-ఉదయగిరి

మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ప్రభుత్వానికి పట్టుకొమ్మలు గ్రామ వలంటీర్లు అని నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వలంటరీ వ్యవస్థ తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా సాహసించని సాహసోపేత నిర్ణయాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీసుకున్నారన్నారు. కరోనా సమయంలో వలంటీర్ల చొరవ దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. రాష్ట్రంలో మరణాల రేటు చాలా తగ్గిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కులమత పార్టీల బేదాభిప్రాయాలు లేకుండా సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత వలంటీర్లపైనే ఉందన్నారు. అర్హులై ఉండి ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థతో ప్రతిపక్షాలలో వణుకు మొదలైందన్నారు. ప్రతి వలంటీర్‌కు ఇచ్చిన 50 ఎళ్లలో అన్ని పథకాలు అందేలా చూడాలన్నారు. మండలంలో 12 సచివాలయాల్లో రూ.100 కోట్ల పైన ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. 2024లో కూడా ఇదే స్ఫూర్తితో పని చేసి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, నియోజకవర్గంలో ఎంఎల్‌ఎగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జున రావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, ఇఒ నరసయ్య, యువనాయకులు మేకపాటి అభినయరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ కల్లూరి కృష్ణారెడ్డి, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొన్నారు.

దళిత వ్యతిరేక చర్యలు ఆపాలి

ప్రజాశక్తి-కావలి : కావలి డివిజన్ జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెం గ్రామంలో దళితులకు వ్యతిరేకంగా అగ్రవర్ణ దూరహంకారులు గ్రామ బొడ్డు రాళ్లు వేస్తున్నారని, ఇందువల్ల అగ్రవర్ణాలకు, దళితులకు మధ్య తగాదాలు జరుగుతాయని, తక్షణం ఆపు చేయించాలని గట్టుపల్లి దళితులు ఆర్‌డిఒను కోరారు. గ్రామంలో బొడ్డు రాళ్లు వేస్తుంటే, ప్రజా ప్రతినిధులుగా ఉన్న దళితులకు మాత్రం చెప్పకుండా అవమానించారని తెలిపారు. ఈ బొడ్డు రాళ్ల ఏర్పాటును అపి, గ్రామంలో శాంతి బద్రతలను కాపాడాలని వారు ఆర్‌డిఒ వి.కె. శీనా నాయక్‌కు వినతి పత్రం అందజేసి కోరారు. కార్యక్రమంలో న్యాయవాది డి.ఎన్.మల్లికార్జున రావు, మానవ హక్కుల సంఘం అధ్యక్షులు పి.కాంతారావు, గట్టుపల్లి గ్రామ దళితులు పాల్గొన్నారు.

24న చలో విజయవాడ

ప్రజాశక్తి-కావలిరూరల్

మున్సిపల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు 24వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని 4వ డివిజన్ మస్టర్ పాయింట్ వద్ద కార్మికులు పిలుపునిచ్చారు. అనంతరం కార్మికులతో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 4సంవత్సరాలుగా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించ లేదని తెలిపారు. కనీస వేతనాలు అమలు చేయలేదని, రిటైర్మెంట్ బెనెఫిట్స్ ఇవ్వలేదని, ఇన్సూరెన్స్ విధానం అమలు చేయలేదని ఇంకా అనేక సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు దశల వారీ పోరాటాలను కొనసాగించినా కంటితుడుపు చర్చలతో కాలయాపన చేసిందన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు అలాగే మిగిలి ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి కార్మికులకు ఇచ్చిన పర్మినెంట్ హామీని నేటికీ అమలు చేయలేదని ఇది చాలా అన్యాయమని తెలిపారు. ఉదయాన్నే పట్టణాలను, పల్లెలను శుభ్రపరిచి ప్రజారోగ్యాన్ని కాపాడే మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవట్లేదని తీవ్రంగా విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 24న సిఐటియు రాష్ట్ర కమిటీ చలో విజయవాడ పిలుపు ఇచ్చిందని ఆ పిలుపులో భాగంగా 24వ తేదీన సిఐటియు అనుబంధ కార్మికులు మస్టర్లను నిలిపివేసి చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ పోరాటం ద్వారా నైనా ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్షులు తురక సీనయ్య, నాయ కులు ఒంగోలు రమేష్, జలదంకి బాబు, ఎస్.ఆనంద రావు, పి.చిన్నమ్మ, ఆర్.అనురాధ కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పసుపులేటి పెంచలయ్య

మాజీ ఎంపి మేకపాటికి సన్మానం

ప్రజాశక్తి-సీతారామపురం



మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డిని జెడ్‌పిటిసి చెరుకుపల్లి రమణారెడ్డితో కలిసి సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య శనివారం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామిసెట్టి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడిగా నియమించినందుకు మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి తనపై మరింత బాధ్యతలు పెరిగాయన్నారు. మండలంలోని వ్యవసాయ రైతుల సమస్యల పరిష్కారం కోసం మరింత పనిచేస్తానన్నారు. రాబోయే 2024 ఎన్నికలలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, ఎంఎల్‌ఎగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించుకునేందుకు మరింత ఉత్సాహంగా పనిచేసి మండలంలో గతంలో లేని విధంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి చెరుకుపల్లి రమణారెడ్డి, సర్పంచ్ చింతన బోయిన దుర్గయ్య యాదవ్, మాజీ సొసైటీ అధ్యక్షుడు పాణ్యం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి పట్టణాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు నియోజకవర్గం సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన పట్టణంలోని ట్యాంక్ బండ్ ఆనకట్ట ఆధునికీకరణ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ కొలను పథకంలో భాగంగా రూ.9 కోట్లతో ఆనకట్ట ఆధునీకరణ పనులను ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. ఆనకట్టపై 9 మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుతోపాటు టైల్స్ విద్యుద్దీకరణ పనులు నవంబర్ నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నీరు అధికంగా నీరునిలువ ప్రాంతం కాబట్టి చుట్టూరా రివిట్‌మెంట్ బలంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి చర్యలు చేపట్టామన్నారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం జలవనరుల శాఖ అధికారులతో కలిసి ఆనకట్ట మ్యాప్‌ను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఇఇ వెంకటేశ్వర్లు, ఎఇలు చంద్రమౌళి, సురేష్, వేణు, వైసిపి మండల కన్వీనర్ అక్కి భాస్కర్ రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, యువ నాయకులు మేకపాటి అభినయ రెడ్డి, షర్ఫుద్దీన్, పెంచలయ్య పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

క్రమశిక్షణ, విలువలు గల విద్యను విద్యార్థులకు అందించాలని ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎంపిపిఎస్ కుర్రపల్లి, కృష్ణంపల్లి ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్య కంటే ముందుగా విద్యార్థులకు క్రమశిక్షణ విలువల గురించి ప్రతిరోజు పాఠశాలకు హాజరవడం, పరిశుభ్రంగా ఉండడం, వరుస క్రమంలో రావడం, పెద్దలను గౌరవించడం, అబద్ధాలు, అసభ్య పద జాలం మాట్లాడకుండా ఉండడం మొదలైన క్రమశిక్షణ విలువలు నేర్పుతూ విద్యను అందించాలన్నారు. ప్రతిరోజు విద్యార్థులహాజరు 95శాతం, మధ్యాహ్న భోజన హాజరు 90శాతంపైన ఉండే విధంగా చూడాలని బోధన అభ్యసన సామగ్రి తరగతి గదులలో ప్రదర్శించాలన్నారు. విద్యార్థుల వ్యక్తిగత సమాచారం అనగా విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్స్, ఇంటి వద్ద వారి స్థితిగతులు తెలుసుకొని విద్యార్థులకు తగిన తర్ఫీదు ఇస్తూ ఉండాలని తెలియజేశారు. అనంతరం అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన సమాచారం నైపుణ్యాలను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం విద్యార్థులతో చేసి వారు సంతృప్తి వ్యక్తం చేయడంతో నిర్వాహకులను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు శివరాం రెడ్డి, టి.సుభాషిని, ఎస్.కె.సైరాభాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చెర్లోఎడవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిపి, ఎంపిడిఒలు మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. లేఅవుట్‌కు సంబంధించి ఎంపికైన 15 మంది లబ్ధిదారులు తమ సొంతంగా అయినా ఇల్లు నిర్మించుకోవచ్చని, సొంతంగా నిర్మించుకోలేని వాళ్ళు తమకు అందుబాటులో ఉన్న కాంట్రాక్టర్ ద్వారా అయినా కట్టించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం 1.80 లక్షలు ఈ నిర్మాణాలకు అందజేస్తుందని తెలిపారు. పొదుపు గ్రూపు సభ్యులకు రూ.35 వేలు రుణాలు ప్రత్యేకంగా ఇళ్ల నిర్మాణాల కోసం ఇప్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎపిఎం వెంకమ్మ మాట్లాడుతూ బ్యాంకులకు సక్రమంగా తిరిగి చెల్లింపులు చేస్తున్న గ్రూపులకు తప్పనిసరిగా రూ.35వేల రుణాలు ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, హౌసింగ్ లబ్ధిదారులు, పొదుపు సిబ్బంది ఉన్నారు.



ఫొటో జర్నలిస్టుల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు : నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ ఫొటో గ్రాఫర్ల ఎపిపిజెఎ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు డిటి హరికృష్ణ, అధ్యక్షులు ఎస్‌డి.జాకీర్, ఉపాధ్యక్షులు జి.దేవసహాయం, కార్యదర్శిగా ఎస్.కె.ముజా, కోశాధికారి ఎం.వెంకటరావు, సభ్యులుగా ఎన్.మాల్యాద్రి, గణేష్ ఎన్నికయ్యారు.

పలుచోట్ల ఉప ఎన్నికలు

ఎల్ఆర్ అగ్రహారం సర్పంచిగా తిరుమల

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని ఎల్ఆర్ అగ్రహారం పంచాయతీ సర్పంచిగా టిడిపి మద్దతుదారు మంగళ తిరుమల విజయం సాధించారు. శనివారం ఎల్ ఆర్ అగ్రహారం పంచాయతీ సర్పంచ్ పదవికి ఉప ఎన్నిక జరిగింది. ఇక్కడ ముగ్గురు పోటీలో నిలవగా పరుసు వెంకమ్మకు 359, మేక కిరణ్‌కు 305 ఓట్లు రాగా మంగళ తిరుమలకు 447 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థిపై 88 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నికల అధికారి ఇ.వి ప్రసాద్ డిక్లరేషన్ పత్రాన్ని అందజేశారు. అనంతరం సర్పంచ్ తిరుమల మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గ టిడిపి మాజీ ఎంఎల్‌ఎ బొల్లినేని వెంకట రామారావు, ఎల్ఆర్ అగ్రహారం నాయకులు కొర్రపాటి రామారావు, గుర్రం ప్రవీణ్ ఆశీస్సులతో తాను సర్పంచ్‌గా విజయం సాధించానని, ఎల్ఆర్ అగ్రహారం ప్రజలకు రుణపడి ఉంటానని, పంచాయతీ అభివద్ధికి కషి చేస్తానన్నారు. ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు టిడిపి మండల అధ్యక్షులు పులిగుంట మధుమోహన్ రెడ్డి మంగళ తిరుమలను అభినందించారు. ఈ సందర్భంగా బొల్లినేని రామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 15 వార్డులకు ఎన్నికలు జరగగా 10 వార్డులు టిడిపి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారన్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో ఉదయగిరి ఎంఎల్‌ఎగా తాను, ముఖ్యమంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు విజయం సాధిస్తామన్నారు. 175 ఎంఎల్‌ఎ సీట్లకు 175 మందిమి గెలుస్తామని ధీమా వ్యక్తం చేసినారు. రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు ప్రజలు విసిగి ఉన్నారన్నారు. కొర్రపాటి రామారావు, గుర్రం ప్రవీణ్, పచ్చ పెంచలనాయుడు, కంచర్ల వినోద్ నాయుడు, స్వర్ణ నాయుడు, మేదరమెట్ల శేషారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

ప్రజాశక్తి-జలదంకి : ఎల్ఆర్ అగ్రహారం సర్పంచ్ ఉప ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిసాయి. కావలి డిఎస్‌పి వెంకటరమణ పర్యవేక్షణలో సర్పంచ్ ఎన్నిక సజావుగా జరిగింది. కావలి ఆర్‌డిఒ శీనానాయక్, జిల్లా పంచాయతీ అధికారిని సుస్మితా రెడ్డి పోలింగ్ తీరును పరిశీలించారు. గ్రామంలో 144 సెక్షన్ విధించి, ఎన్నికల నియమావళికి ఆటంకం కలగకుండా సజావుగా సాగేందుకు పోలీస్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు.

పాతపాడు 5వ వార్డు వైసిపి విజయం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ (చేజర్ల) : చేజర్ల మండలం, పాతపాడు గ్రామపంచాయతీ 5వ వార్డు సభ్యురాలిగా షేక్ మస్తాన్‌బీ ఎన్నికలలో విజయం సాధించింది. 5వ వార్డు సభ్యుడు మరణించిన కారణంగా జరిగిన ఉప ఎన్నికల్లో మస్తాన్‌బీ వైసిపి మద్దతుతో పోటీ చేసింది. శనివారం జరిగిన ఎన్నికల్లో మస్తాన్‌బీ విజయం సాధించింది. మండలంలోని మూడు వార్డు సభ్యుల ఎన్నికకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేయగా కోటితీర్థం 8వ వార్డు, మాముడూరు గ్రామంలోని 1వ వార్డు వైసిపి చెందిన మద్దతు దారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక జరిగిన పాతపాడు 5వ వార్డు కూడా వైసిపి మద్దతుతో పోటీ చేసిన మస్తాన్‌బీ గెలుపొందింది. మస్తాన్‌బీకి రిటర్నింగ్ అధికారి డిసి మస్తానయ్య ధ్రువీకరణ పత్రం అందజేశారు.

ప్రజల మద్దతు వైసీపీకే : తూమాటి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్(చేజర్ల) : ప్రజలు సంక్షేమం కోసం పాటుపడే వైసిపి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఎల్లప్పుడు ఉంటుందని చేజర్ల మండల వైసిపి కన్వీనర్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు తూమాటి విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం వైసిపి మద్దతుతో విజయం సాధించిన పాతపాడు 5వ వార్డు సభ్యురాలు షేక్ మస్తాన్‌బీని విజయ భాస్కర్ రెడ్డి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు చేపట్టి పేదరిక నిర్మూలన దిశగా పాలన సాగిస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఎప్పుడు వెన్నుదన్నుగా నిలుస్తారని తెలిపారు. అలాగే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళుతున్న ఆత్మకూరు ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి కూడా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పరచాలని ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని తెలిపారు. అనంతరం వార్డు ఎన్నికల్లో విజయం సాధించినందుకు గానూ నాయకులకు ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపి ఏ ఎన్నికలు జరిగినా వైసిపికి మద్దతు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అల్లంపాటి చిరంజీవి రెడ్డి, కాకుమూరి వెంకట్ రెడ్డి, మాలపాటి పెంచల్ రెడ్డి, ఒంటేరు సుధీర్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి విజయం

ప్రజాశక్తి-కొండాపురం : మండలంలోని సాయిపేట పంచాయతీలో శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ నెలకొంది. వైసిపి నుండి బండారు తిరుపతయ్య పోటీ చేయగా టిడిపి నుండి దుర్గ అంకబాబు సానంగుల రవీంద్ర పోటీ చేశారు. 340 ఓట్లకు గానూ 251 ఓట్లు పోలయ్యాయి. టిడిపి అభ్యర్థి సానంగుల రవీంద్రకు 146 ఓట్లు రాగా, మరో టిడిపి అభ్యర్థి అంకబాబుకు 81 ఓట్లు వచ్చాయి. కేవలం 20 ఓట్లే రావటం వల్ల డిపాజిట్లు కోల్పోయింది. గతంలో ఈ వార్డు వైసిపికి ఏకగ్రీవంగా ఇచ్చారు. ఈ ఎన్నిక రాబోయే సార్వత్రిక ఎన్నికలకు టిడిపి కార్యకర్తల ఆత్మవిశ్వాసం పెంచిందని భావిస్తున్నారు.

పాటూరులో టిడిపి జోష్..

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని పాటూరు గ్రామంలో రెండో వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థి గెలుపొందడంతో టిడిపి శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. ఎన్నికల అధికారిగా పంచాయతీరాజ్ శాఖ ఏఈ పరమేశ్వరి లింగం వ్యవహరించినట్లు ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. గ్రామంలోని రెండో వార్డులో 331 ఓట్లు ఉండగా వాటిలో 242 ఓట్లు పోలయ్యాయి వీటిలో మహిళలు 149, పురుషులు93 ఉన్నారు.73.11 శాతం ఓటింగ్ జరిగింది. టిడిపి బలపరిచిన అభ్యర్థి రామిశెట్టి రాజేశ్వరి(గౌను గుర్తు)133 ఓట్లు, వైకాపా బలపరిచిన అభ్యర్థి(కుక్కర్ గుర్తు)107 ఓట్లు పోలయ్యాయి. రెండు ఓట్లు చెల్ల లేదు. దీంతో టిడిపి బలపరిచిన అభ్యర్థిని రామిశెట్టి రాజేశ్వరి 26 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇనమడుగు గ్రామం 11వ వార్డు తెదేపా బలపరిచిన అభ్యర్థిని ఉండ్రాల లక్ష్మీ ప్రసన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరుయాత్ర

ప్రజాశక్తి-నెల్లూరు : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నగరంలోని 54 డివిజన్ల పరిధిలో అపరిష్కృతంగా ఉన్న ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకొనే క్రమంలో సిపిఎం ప్రజాపోరుయాత్ర చేపట్టింది. ఆగష్టు 2వ తేదీ నుంచి ఆగష్టు 15వ తేదీ వరకు నగరం, రూరల్ నియోజకవర్గం పరిధిలోని సిపిఎం కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రజాపోరుయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన కనిపించింది. పోరుయాత్ర సమయంలో ప్రజల నుంచి తెలుసుకున్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని సచివాలయాల ఎదుట సైతం ఆందోళనలు చేపట్టారు. అయినప్పటికీ జిల్లా అధికారుల నుంచి ఎటువంటి స్పందన కానరాకపోవడంతో కార్పొరేషన్ కార్యాలయాన్ని సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వికాస్ మర్మత్ దృష్టికి పలు సమస్యలను సిపిఎం నాయకులు తీసుకొచ్చారు. ప్రజల సమస్యలకు సంబంధించి నిర్దిష్టమైన ఆధారాలతో 'స్పందన' కార్యాలయంలో పాల్గొని వినతిపత్రం అందజేయాలని, ఆ సమస్య పరిష్కరించేందుకు తానే స్వయంగా ఆ ప్రాంతానికి చేరుకొని పరిష్కరిస్తామంటూ పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించుకొనే విధానం ఇది కాదని, ఆందోళనలు, ముట్టడి వంటి కార్యక్రమాలు చేపడితే సరిపోదని, ఇటువంటి కార్యక్రమాలు చేస్తే కేసులు నమోదు చేస్తామంటూ నాయకులను హెచ్చరించారు. పోలీసు కేసులు తమకు కొత్తేమీ కాదని, ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యాలయానికి వచ్చామని, అటువంటి సమయంలో ఈ విధంగా కమీషనర్ వ్యవహరించడం సరికాదంటూ సిపిఎం నాయకులు సమాధానం ఇచ్చారు. ఉపాధ్యాయ సంఘం ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అసంబద్ధమైన ఉపాధ్యాయుల సర్దుబాటును నిలుపుదల చేయాలంటూ విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. బదిలీలు, పదోన్నతులు జరిగి రెండు నెలలు పూర్తి కావస్తున్నా వారికి ఇంతవరకు జీతాలు రాకపోవడం దుర్మార్గమన్నారు. అంతటితో ఆగకుండా మళ్లీ ఇప్పుడు అత్యవసరంగా ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టడం దారుణమంటూ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన 117 జి.ఒ. వల్ల ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం చేస్తూ, బడుగు, బలహీన వర్గాల వారికి విద్యను దూరం చేయడానికి ప్రభుత్వం పూనుకుంటుందని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని నిందిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటును నిలుపుదల చేసి బదిలీలు, పదోన్నతులు పొందిన వారికి జీతాలు వెంటనే చెల్లించి విద్యారంగాన్ని పరిరక్షించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నగర, రూరల్ నియోజకవర్గాల పరిధిలో ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమం అధికార పక్షం, ప్రతిపక్షం పోటాపోటీగా నిర్వహిస్తున్నాయి. మరోపక్క రూరల్ నియోజకవర్గంలో అటుకులు చిటుకులు మారండి అన్న చందంగా వైసిపి నుంచి టిడిపికి, టిడిపి నుంచి వైసిపి మారుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకొనే విధంగా నాయకులు వ్యూహాలు, ప్రతివ్యూహాలు పన్నుతున్నారు. రాజకీయ పార్టీలు సనమ్వయ కమిటీ సమావేశాలు, బూత్‌కమిటీ సమావేశాలు నిర్వహించుకుంటూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నాయి.

- వీక్షణం